(కిందటి సంచిక తరువాయి..)

రమాపతి అడిగాడు. ''వాళ్ళు కొత్త ఫ్లాట్ కొంటున్నారటగా'' నీరజ అతని వీపులో తట్టి సైగతో చెప్పింది. ''అవును''

''ఎప్పుడు మారుతారట అందులోకి''

''ఏమో నాకు తెలియదు''

''వాళ్ళంతా బయటకు వెళ్ళిపోయారు కదా - మాట్లాడి చెప్పరాదా?''

విసుక్కున్నాడు రమాపతి.

''అబ్బో అంతగా నేనరవలేను. ఛాతిలో నొప్పి వస్తుంది''

''ఉహూ - సరే అయితే. మధ్యాహ్నం వార్తాపత్రిక చదివి వినిపించగలిగితే వినిపించు''

''అలాగే లెండి''

నీరజ ఒక్కోసారి పగటిపూట రమాపతికి ఓ మామిడి పండో, ఓ అరటిపండో, తక్కువరకం మిఠాయో ఇస్తుంది. రత్న అది కూడా భరించలేదు. ''ముసలితనంలో కూడా రుచులు కావల్సి వచ్చాయి'' అని అంటుంది. దానికి తోడు ''పెట్టే వాళ్ళుంటే ఎంతైనా తింటాడమ్మోయ్ ముసలాయన!'' అని పనిమనిషి బసిని వంత పాడుతుంది. అదే పనిమనిషి నీరజకు వాళ్ళ విషయాలు చేరవేస్తుంది. ''వాళ్ళ కొత్త ఫ్లాట్ తయారయ్యిందటమ్మా - ఇంకేం ఎగిరిపోతారు''

''నిజమేనటే బసినీ''

''అవునమ్మా నిజం. నన్ను కూడా పనికి అక్కడికే రావాలని చెబుతున్నారు''

''వెళుతున్నావా?''

''ఆ... అంత దూరం నేనెక్కడ వెళ్ళగలనమ్మా? నా మొగుడు, పిల్లలు, సంసారం...''

తమ కొడుకు తమను అపహాస్యం చేసినట్టుగా అనిపించింది నీరజకు. కొత్త ఫ్లాట్‌లోకి వెళుతున్న విషయం తమతో మాటమాత్రంగానైనా చెప్పొచ్చు కదా? విషయాలన్నీ పనిమనిషి ద్వారా తెలుసుకోవాలా? తమ ఏకైక సంతానం శుభ్రో చేసే నిర్వాకం ఇదా?

నీరజ కొడుకు గదిలోకి వెళ్ళక ఎన్నాళ్ళయి పోయిందో. ఆ రోజు మాత్రం వెళ్ళింది.

''అమ్మా! ఏమిటి? ఏమైనా చెప్పాలని వచ్చావా?'' అన్నాడు కొడుకు.

''అవున్రా. కొత్త ఫ్లాట్‌లోకి మారుతున్నారని బసిని చెబుతోంది. నిజమేనా?''

''అవును నిజమే''

''ఎప్పుడు వెళ్తున్నారు?''

''అంతా నీ చేతిలోనే ఉంది అత్తయ్యా!'' అని అంది రత్న, మధ్యలో కల్పించుకుని. నీరజ ఆశ్చర్యపోయింది.

''నా చేతిలో ఏముందీ?''

''మీరు మామగారిని వదిలి రాలేరు...''

''అవును. ఆయన కూడా వస్తారు''

''ఒద్దులే. ఇక్కడ ఈ ఇల్లు ఖాళీగా ఉండడం మంచిది కాదు... ఇంత పెద్ద ఇల్లు. మీరిద్దరు అని ఆలోచిస్తున్నాను'' అన్నాడు శుభ్రో.

''ఫ్లాట్ చాలా పెద్దదా?'' అని అడిగింది నీరజ. దాంతో మనవడు రంగంలోకి దిగాడు.

''అవును నానమ్మా! చాలా పెద్దది. మూడు బెడ్‌రూమ్స్, రెండు బాత్రూమ్స్, డైనింగ్ కం డ్రాయింగ్, కిచెన్, బాల్కనీ''

ఎందుకోగాని శుభ్రో కంగారు కంగారుగా చెప్పాడు. ''మీరంతా వచ్చి చూద్దురుగాని ఫ్లాట్. మేమిక్కడి నుండి మారిపోయినా... అప్పుడప్పుడు వచ్చిచూస్తూనే ఉంటాం. నేను మాత్రం తప్పక...''

''అది సరేరా! మీ నాన్నగారితో ఓ మాట చెప్పావా?'' దానికి కొడుకు సమాధానం చెప్పకముందే మనవడు మళ్ళీ అందుకున్నాడు. ''నానమ్మా! ఆ అపార్ట్‌మెంట్ పేరు మధుమాలతీ అపార్ట్‌మెంట్. తెలుసా?''

''ఆ... ఆ... పేరు బాగుంది నాన్నా''

''అమ్మా'' అన్నాడు శుభ్రో భారంగా.

''ఏంటి శుభ్రో'' నీరజ కొడుకు ముఖంలోకి చూసింది.

''మేం వెళ్ళిపొయ్యాక మీరు కూడా ఇక్కడి నుంచి...''

నూటికీ కోటికీ ఒకడుంటాడు ఇలాంటివాడు అని జనమంతా ప్రశంసించిన కొడుకు...?? ఆ మాటతో ఎందుకో ఆమె పెదాల మీద నవ్వు ఎండిపోయింది. అతని తెలివిగల బుర్రలో తిరుగాడే క్రూరమైన ఆలోచనలు ఆమెను చుట్టుముట్టాయి.

''మా గురించి నీకు బెంగేం అక్కరలేదు. మీరు సుఖంగా ఉండండి చాలు. మేమూ ఎక్కడో రెండు చిన్న గదులు అద్దెకు తీసుకుని కాలం వెళ్ళదీస్తాం''

''అబ్బో అద్దె గదులైతే బోలెడంత అడ్వాన్సు అడుగుతారు'' అంది రత్న.

''అవన్నీ నాకు తెలియవు''

''నేను చూస్తాలేమ్మా అవన్నీ... కాని...'' శుభ్రో తటపటాయించాడు.

''అయితే ఇంకేం? మా గురించి ఆలోచించాల్సిందేమీ లేదు. మీ కొత్త ఇల్లూ, కొత్త ఖర్చులు... అవి చూసుకోండి'' అంది నీరజ కొడుకువైపు చూసి.

శుభ్రో తల్లి చూపులకు తట్టుకోలేక పోయాడు. ఒంట్లో రక్తంలేక బక్కగా బలహీనంగా ముతక బట్టలలో ఉన్న ఆ అపరిచిత వృద్ధురాలి ముందు శుభ్రో తలదించుకున్నాడు.

నీరజ గిరుక్కున తిరిగి వెళ్ళిపోయింది. రత్న భర్త భుజం తట్టి - ''సెంటిమెంటలై పోకండి. ఆమె మీకు కనిపిస్తున్నంత బలహీనురాలేం కాదు. చూశారా ఆమే మొదట అంది. అద్దె గది చూసుకుని వెళ్ళిపోతామని!''

భార్యతో వాదించాలనిపించలేదు శుభ్రోకు. ''అమ్మ బాగా క్షీణించిపోయింది పాపం! ఒళ్ళంతా శుష్కించి పోయింది. ఈ మధ్య ఎప్పుడూ సరిగా చూడలేదామెను. నాన్నగారి గదిలోకి వెళ్ళక ఎన్నేళ్ళయ్యిందో గుర్తే లేదు'' శుభ్రో ఆలోచనల్లో పడ్డాడు.

''మనం నానమ్మ, తాతయ్యలను కూడా మనతోపాటు కొత్త ఫ్లాట్‌లోకి తీసుకెళదాం డాడీ!'' అన్నాడు పసివాడు.


''నోరుమూసుకో. పెద్దవాళ్ళు మాట్లాడుతున్నప్పుడు అరవగూడదు'' అని మందలించింది రత్న చిన్నారి కొడుకును. మళ్ళీ భర్తవైపు తిరిగి ''ఏం బాధ లేదు. హాయిగా ఉంటారు వాళ్ళు. ఎవరైనా మంచి కిరాయిదారు లభిస్తే కొంచెం అడ్వాన్సు తీసుకొని, ఈ ఇల్లు బాగుచేయిస్తే సరి! దీనికి కూడా మంచి అద్దె వస్తుంది. అత్తయ్య చెప్పింది బాగానే ఉంది'' సమర్థించింది రత్న.

''అవునవును. నాక్కూడా ఆర్థికంగా భారం ఉండదు'' శుభ్రో మరో కొత్త విషయం కనుగొన్నట్టు సంతోషపడిపొయ్యాడు.

''అవును నీకెందుకు భారం?''

''అవుననుకో. కాని, నేనో క్రిమినల్‌నని నాకెందుకో మొదటిసారి అనిపిస్తోంది ఇవ్వాళ. నాన్నకు కళ్ళు లేవు. అమ్మకా చేతకాదు. ఈ ఇల్లంతా రిపేర్ చేయడం మాటలా?'' ఆ మాటలకు రత్న మెత్తబడలేదు.

''ఆమె తలుచుకుంటే చేయించగలదు. మా ఇంట్లో మా నాన్న గుడ్డివాడేం కాదు. అయినా మా అమ్మే ఇల్లు బాగు



# తరాలు - అంతరాలు

**బెంగాలీ మూలం - మహాశ్వేతాదేవి**

**తెలుగు: డా. దేవరాజు మహారాజు**

చేయిస్తుంది. అద్దెకొచ్చిన వాళ్ళతో మాట్లాడుతుంది''

''మా అమ్మ అలాంటిది కాదులే రత్నా. గుట్టుగా ఇంట్లో ఉండే రకం''

''అవును మరి! మీ నాన్నది ఉట్టి ఫ్యూడల్ మగాడి మనస్తత్వం? అందుకే ఆమె అలా ఉండాల్సొచ్చింది.

శుభ్రోకు భార్య మాటల్ని ఒప్పుకోక తప్పలేదు. అవసరాలు తీర్చుకోవడానికి చేసుకున్న పెళ్ళి వారిది. ఆధునిక జీవితంలో సౌకర్యాల్ని అనుభవించడానికి రెండు జీతాలతో పెనవేసుకున్న జీవిత బంధం వారిది. ఒప్పందం వారిది.

ఆ రాత్రి నీరజకు నిద్రపట్టలేదు. కొడుకూ కోడలు వెళ్ళిపోతే ఆమెకు కొంత విశ్రాంతి దొరుకుతుంది. వారివల్ల ఆమెకు ఉపయోగమే లేదు. పొద్దున్నే చలిలో పడుతూ లేస్తూ వంటచేసే పనీ ఉండదు. అయినా సరే ఎందుకో ఒంటరితనం కబళిస్తున్నట్లు భయపడింది. నిశ్శబ్దంగా గుండె పగిలేలా ఏడ్చింది. రమాపతి గ్రహించాడు.

''నీరూ! ఏడుస్తున్నావా?''

''ఏం లేదు లెండి''

''వాళ్ళు వెళ్ళిపోతున్నారని బాధపడుతున్నావు అవునా?''

''అవును!''

రమాపతి మెత్తగా మాట్లాడాడు. ఆమె అతని వీపు మీద గుర్తులతో జవాబు చెప్పింది. ఎన్నో ఏళ్ళ తర్వాత రమాపతి భార్యను తనవైపు తిప్పుకుని, ఆమె వెచ్చని కన్నీళ్ళు తుడిచాడు.

''కళ్ళు లేకపోయినంత మాత్రాన నేను చూడలేనని అనుకోకు. నాకు తెలుసు నీ బాధ! కాని మన చేతిలో ఏముంది? చెప్పూ? కళ్ళులేవని నేను చచ్చిపోయానా చెప్పూ? మనసు కళ్ళతో చూడడం లేదూ? నీ కొడుకు నీ కళ్ళలాండివాడని పుత్ర ప్రేమతో అంధురాలవయ్యావు. ఇన్నాళ్ళు! ఇప్పుడైనా కళ్ళు తెరిచి, జీవిత వాస్తవాల్ని ఎదుర్కో'' అన్నాడు.

''నిజమేనండి. మీరు చెప్పేదంతా... అయినా... ఎందుకో''

''శుభ్రో వెళ్ళిపోతున్నాడన్న వాస్తవాన్ని భరించు. తప్పదు. వాడు మనతో ఇన్నాళ్ళు ఇక్కడ ఉన్నాడన్నమాటే గానీ, వాడు మనకు ఎప్పుడో దూరమై పొయ్యాడు'' రమాపతి గొంతులో దుఃఖం అడ్డుపడింది. ఒక్క నిముషం ఆగి, మళ్ళీ అన్నాడు. ''నా పుస్తకం అచ్చేయించుకుంటానన్న రోజే వాడి సంగతి బయటపడింది. ఆనాడే చెప్పాను కదా! నాకు నీవు, నీకు నేనూ తప్ప మనకెవరూ లేరని!''

ఆ రాత్రి శుభ్రోకు కూడా మనసు మనసులో లేదు. నీరజకు షాపు అద్దె చెల్లిస్తున్న కొట్టతను విషయం తెలుసుకుని, ఇంటి కోసం వచ్చాడు. తన అల్లుడికి ఇల్లు కావాలని, దగ్గరుండి ఇల్లు బాగు చేయించుకుని, సున్నం వేయించుకుని, ఇంట్లోకి దిగుతాడనీ చెప్పాడు.

''సరే అలాగే కానీయ్'' అన్నాడు శుభ్రో. బాధ్యతల్లోంచి బయటపడితే చాలనుకుంటున్నాడతను. ఇల్లు అతనికి ఇవ్వొద్దంది నీరజ.

''అయితే ఎవడికిస్తావ్ మరీ?'' విసుక్కున్నాడు శుభ్రో తల్లిని.

''నేనెప్పుడూ వెళుతుంటాను. డాక్టర్ దిలీప్. అతనికి ఇల్లు కావాలని అన్నాడోసారి. ఎన్నోసార్లు ఫ్రీ ట్రీట్‌మెంట్ ఇచ్చాడు కూడా'' అభ్యంతరం చెప్పడానికి వీల్లేకపోయింది శుభ్రోకు.

''అహా... అలాగయితే తెచ్చుకో! అయితే రాతపూర్వకంగా ఏ ఎగ్రిమెంటుకూ రావొద్దు. తర్వాత నేను ఇబ్బందుల్లో పడతాను'' అని అన్నాడు.

''తర్వాతంటే ఎప్పుడూ?'' అర్థంకాక అడిగింది తల్లి.

''నేను ఖాళీ చేయించ దలుచుకున్నప్పుడు'' అని అరిచాడు కొడుకు. శుభ్రో తల్లి మీద అంతగా అరవడం రమాపతి ఎప్పుడూ వినలేదు.

''ఏమిటది శుభ్రో. అమ్మను అరుస్తున్నావెందుకూ?'' అంటూ వెళ్ళాడు వారి మధ్యలోకి.

''నువ్వెందుకొచ్చావ్? నిన్నెవడు పిలిచాడు'' అన్నాడు శుభ్రో విసురుగా తండ్రిని చూసి.

''ఎందుకొచ్చానంటే, ఈ ఇల్లు నాది గనక వచ్చాను. ఇంటి గురించి ఏదో మాట్లాడుతున్నారని వచ్చాను. తర్వాతంటే మేమిద్దరం చనిపోయిన తర్వాత అనా?'' అపరిచిత వ్యక్తిలాగా చిరునవ్వు నవ్వాడు రమాపతి. దెబ్బతిన్నట్టు చూశాడు శుభ్రో.

''ఇబ్బందుల్లో పడతానన్నది నీకెప్పుడూ లేదురా శుభ్రో. చిన్నప్పటి నుండి ఇప్పటిదాకా ఆ అవసరం నీకు మేమెప్పుడూ రానీయలేదు. ఒక ఇంట్లో రెండు వంట గదులు నీ సదుపాయం కోసం చేసుకున్నవే. మీ అమ్మను ఒక బానిసలాగా చేసిందీ నీ సదుపాయం కోసమే. ఈ ఇంట్లో ఇంతకాలం ఉండి అద్దె వెనకేసుకున్నదీ, దాంతో కొత్త ఫ్లాట్ కొనుక్కుంటున్నదీ నీ సదుపాయం కోసమే. నువ్వు చేస్తూ వచ్చిందానికల్లా నీ తల్లిదండ్రులు నోరు మెదపకుండా ఉన్నది నీ సదుపాయం కోసమే. నీక్కావల్సింది రాబట్టుకోవడానికి నువ్వు ఎంతకైనా దిగజారుతున్నావు. ఇక నాకు తెలీక అడుగుతాను. నువ్వు ఇబ్బందుల్లో పడింది ఎప్పుడురా తండ్రీ?'' తండ్రి గొంతులోంచి కఠోర సత్యాల్ని వినలేకపోయాడు శుభ్రో.

''అయితే మీ ఇష్టం. మీ ఇష్టం వచ్చినట్టు చేసుకోండి''

''అదెలాగూ తప్పదు గానీ, మా కోసం నువ్వేదో బాధపడిపోతున్నట్టు, త్యాగాలు చేసినట్టూ మాట్లాడకు. బాగుండదు. అసహ్యంగానూ, అసందర్భంగానూ ఉంటుంది. నువ్వేమిటో తెలుసుకోవడం మీ అమ్మకు చేతకాదు గానీ, నాకెప్పుడో తెలిసిపోయిందిరా నాయినా? నాది ఓడిపోయిన వాడి జీవితం అని అన్నావు. నేను ఓడిపోకపోతే నువ్వెట్లా గెలిచేవాడివో ఆలోచించుకో - నీలాగా విలువల్ని తొక్కేస్తూ - భౌతిక సుఖాల కోసం పరుగులు పెట్టలేదు నేను. నాకు జీవితంలో సంతృప్తి ఉంది. నీకు ఉందా ఆలోచించుకో. అయినా మీరు మీ కొత్త ఇంటికి వెళ్తున్న సందర్భంలో ఈ రభస ఎందుకూ? హాయిగా వెళ్ళండి''

తను తండ్రికన్నా ఎంతో ఎత్తు ఎదిగాననుకున్నాడు శుభ్రో. కాని అతని దృష్టిలో ఎంత దిగజారాడో తెలుసుకునే సరికి భరించలేకపోయాడు.

''మంచి గురించి, మమత గురించి, కలల గురించి, కళల గురించీ కనీస జ్ఞానం లేనివాడివి. నీకివన్నీ ఏమర్థమౌతాయి? నువ్వు నా పుస్తకం అచ్చెయ్యొద్దని సలహా ఇచ్చినపుడే, నేను చాలా స్థిరమైన అభిప్రాయానికి వచ్చాను. కవిత్వం అనేది సున్నిత హృదయులు ఆనందించే ప్రక్రియ. నీలాంటి మొరటు మనుషులకు, పనికొచ్చేది కాదు. నా తర్వాత ఈ ఇల్లు మీ అమ్మదవుతుంది. ఆమె తర్వాతే నీకు దక్కుతుంది. తెలిసిందా? అందువల్ల ఈ ఇంటి గురించి నీకు ఏ ఇబ్బందులూ ఉండనక్కరలేదు'' చాలా స్పష్టంగా, గంభీరంగా పెద్ద గొంతుతో చెప్పాడు రమాపతి.

అది శుభ్రో భరించలేకపొయ్యాడు. ''ఏమనుకుంటున్నావ్ నన్ను? తల్లిదండ్రులను చూసుకోలేని వెధవనా? బాధ్యతలు తెలియని మూర్ఖుణ్ణనా? ఏమిటీ? ఏమనుకుంటున్నావ్?'' అని శుభ్రో కోపంతో వొళ్ళు మరచి అరిచాడు.

''కాదు. అలాంటిదేమీ మేమనుకోవడం లేదు. మీ తరం వేరు. మా తరం వేరు. మీ తరం వారు మాకు అపరితులు. అపరిచితులు కాబట్టే మీ మీద మాకు నమ్మకం లేదు. అంతే. మీరు పశువులా? మనుషులా అన్నది నిజంగానే మాకు తెలియదు. తెలియనప్పుడు అనవసరంగా మేం నోరు పారేసుకోగూడదు'' అన్నాడు రమాపతి మరింత స్థిరంగా.

భర్త ఆత్మగౌరవం కాపాడడానికి రత్న అక్కడికి పరుగెత్తుకుని వచ్చింది. అతణ్ణి తమ గదిలోకి ఈడ్చుకెళ్ళింది. ''ఇక ఊరుకోండి! మీరు అరవడం చుట్టుపక్కల జనమంతా విన్నారు. ఇక బావుండదు'' అని శుభ్రోకు నచ్చజెప్పింది. జనం తమని తప్పుపడతారని ఆమె భయం.

నీరజ అప్పటిదాకా ఊపిరి తీసుకోవడం కూడా మరిచిపోయినట్టుంది. అయోమయంగా ఉన్నపళాన కూలబడింది.

ఇంత గొడవ జరిగాక తల్లిదండ్రులను కొత్త ఇంటికి ఆహ్వానించే అవసరమే కనిపించలేదు -శుభ్రోకు. సమయానికి రత్న వాళ్లమ్మ వచ్చింది. దగ్గరుండి గృహప్రవేశం జరిపించింది. పూజలు చేయించింది. వంటలన్నీ తమ ఇంట్లో వండించి కొత్తింటికి తెప్పించింది. ఇల్లు వదిలి వెళ్ళిపోయే ముందు కొడుకు, కోడలు, మనుమడు కాళ్ళకు దండం పెట్టడానికి వచ్చారు. రమాపతి ఏదో గొణుక్కున్నాడు. నీరజ మౌనం వహించింది. తన తల్లిదండ్రుల్ని పనికిరాని వాళ్ళ కింద జమకట్టాడు శుభ్రో. కానీ వాళ్ళు అంతకన్నా ముందే అతణ్ణి వెలివేసిన విషయం ఇంతకాలం అతను గ్రహించుకోలేక పోయాడు.

రత్న స్నేహితులంతా వచ్చారు. టేపురికార్డర్‌లో పాటలు మ్రోగించారు. నవ్వులు, కేరింతలతో పండుగ వాతావరణం వచ్చింది. ఒకరు మాంసం కూర, మరొకరు పూరీలు, మరొకరు స్వీట్లూ, మరొకరు మరొకటీ... వంటకాలు తెచ్చారు. రత్న సంతోషానికి అవధుల్లేవ్. ''కిటికీలోంచి ఎంత చల్లటిగాలి వస్తుందో చూశారా? మనకిక ఫ్యాన్‌లు కూడా అక్కరలేదు'' అని అంది భర్తతో. తమ కొత్త ఫ్లాట్ ప్రత్యేకతల గూర్చి ఆనందపడిపోతూ-

శుభ్రో మాత్రం రత్నలాగా ఆనందించలేకపోయాడు. సాయంత్రం బాగా పొద్దుపోయాక బాల్కనీలో కూర్చుని బయటికి చూశాడు. అద్భుతంగా ఉంది.... దృశ్యం! దూరంగా టెలివిజన్ టవర్ ఎర్రలైటు కనిపిస్తోంది. నక్షత్రాలు, ఆకాశం, విశాలమైన స్థలం, ఆరో అంతస్థులో, శుభ్రమైన చల్లటి గాలి, కిందికి చూస్తే కళకళలాడిపోతున్న నగరం - దీపావళి పండుగ రాత్రిని తలపిస్తోంది.

కాని శుభ్రోకు అందమైన ఆ పరిసరాలకూ మధ్య ఒక గుడ్డి ముసలివాడు, ఒక మురికి తల్లీ అడ్డం వస్తూ ఉన్నారు. తల్లిదండ్రులు లేని ఈ సుఖమయమైన జీవితం కోసం ఎన్నేళ్ళ నుండో తను పథకాలు వేసుకుంటున్నాడు. తనను పెంచి, పెద్దచేసి, అన్ని శక్తుల్నీ అందించి, సుఖంగా గడపడానికి అన్ని వసతులు కల్పించిన తన తల్లిదండ్రుల్ని... తనెంత చిన్నచూపు చూశాడు? చివరకు తను వారిని కాదనడం కాదు, వారే తనను కాదన్నారు. తను ఎంతటి దుర్మార్గుడయితే వాళ్ళట్లా అన్నారూ? సాయంత్రం గడ్డ కట్టినట్టయ్యింది శుభ్రోకు.

రత్న బాల్కనీలోకి వచ్చి, ఒంటరిగా కూర్చున్న భర్తను చూసింది.

''ఏమిటీ ఇక్కడ ఒంటరిగా కూర్చున్నారూ? రండి. అక్కడ అందరితో సరదాగా గడపక? ఇంకా వాళ్ళ గురించే ఆలోచిస్తున్నారా? మీరు చెయ్యాల్సింది చేశారు. అయిపోయింది. ఇక పోనీండి. ఆ విషయం!''

''పోనివ్వాలా? కొడుకుగా నా బాధ్యత నేను పూర్తి చేశానంటావా?''

''ఆ... చేశారు. ఏం?''

''ప్చ్... ఏమీ లేదు. నాకు తెలుసు!'' ఒక పేలవపు నవ్వు అతని పెదాల మీది నుండి జారిపోయింది. ''నాకేమనిపిస్తోందంటే...''

''ఏమనిపిస్తోంది?''

''మనం మన చంటివాణ్ణి ఎంతో జాగ్రత్తగా, ప్రాణంగా పెంచుతున్నాం కదా?''

''అవును. పెంచుతున్నాం?''

''మన స్థాయికి మించి, వాణ్ణి గొప్పవాణ్ణి చెయ్యాలని చూస్తున్నాం కదా?''

''అవును చూస్తున్నాం! మారుతున్న కాలానికి తగినట్టుగా వుండొద్దూ మరీ? మన చిన్నారి కన్నడు''

''అవును ఎలాంటి మాటలు మాట్లాడడానికి నేను మా నాన్నను బలవంతం చేశానో, రేపొద్దున్న వాడూ నన్ను అలాంటి అసహాయ స్థితిలోకి పడదోస్తాడు... నాతో అలాంటి మాటలే అనిపిస్తాడు'' అనంటూ దీర్ఘంగా నిట్టూర్చాడు శుభ్రో.... ''పద'' అంటూ లేచి బరువుగా ఇంట్లోకి నడిచాడు.

తామిద్దరే కాక తమతోపాటు మూడోవారెవరో కూడా ఇంట్లోకొస్తున్నట్టు అనిపించింది రత్నకు. నిదానంగా ఆలోచించిన మీదట అది ఎవరో కాదు-

శుభ్రో మాటలతో తనలో నిద్రలేచిన అనూహ్యపు భవిష్యత్తు గూర్చి ఏర్పడ్డ భయం!

కొత్త ఫ్లాట్ చాలా విశాలంగా ఉంది. అది అన్నింటికీ చోటివ్వగలదు.